క్లుప్తంగా

14న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సీతంపేట: ఈ నెల 14న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీబీ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోపి గ్రామపంచాయతీల పరిధిలో గల లబ్ధిదారులు ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

నేడు శ్రీవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం



సీతంపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం

సీతంపేట: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 6 గంటలకు తోమాల సేవ, సహస్ర నామ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం విశేష హోమాలు, పూర్ణాహుతి, ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశాభిషేకం వంటి పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

జీవనోపాధి పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లలితకుమారి

వీరఘట్టం: మహిళా సంఘాలు జీవనోపాధి పెంపొందించుకోవాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి సూచించారు. ఈ మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీనిధి, సీఐ ఎఫ్, బ్యాంకు లింకేజీ రుణాలను ఉపయోగించుకు ని మహిళా సంఘ సభ్యులు వ్యాపారవేత్తలుగా మారాలని పిలుపునిచ్చారు. అలాగే మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా వీఓఏలు చొరవచూపాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం కె.రాము, మహిళా సంఘాల సభ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా సేవలు

- డీఈ విష్ణుమూర్తి



విద్యుత్ శాఖ డీఈగా బాధ్యతలు స్వీకరించిన విష్ణుమూర్తి

పాలకొండ రూరల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ వర్గాలకు చెందిన వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు శాఖాపరంగా అందిస్తామని డీఈ విష్ణుమూర్తి అన్నారు. ప్రస్తుతం పాలకొండలో డీఈగా విధులు నిర్వహిస్తున్న టీజీకే మూర్తి బదిలీపై విశాఖ వెళ్లారు. ఆ స్థానంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన విష్ణుమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఏఈ శ్యాంసుందర్‌తో పాటు సహచర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు.


వర్షాలతో ఉపాధి పనులకు ఆటంకం



గురండిలో చెరువులోని గోతుల్లో చేరిన వర్షపునీరు

భామిని: మండలంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఉపాధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తుండడంతో ఉపాధి పనులు చేస్తున్న చోట బురదమయంగా మారగా పనులు చేయడానికి వేతన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వేతన దారుల హాజరు తగ్గుతోందని ఉపాధి అధికారులు చెబుతున్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



టేకరికండిలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు అన్నారు. కురుపాం మండలంలోని టీకరకండి, బుల్లుగూడ గ్రామాల్లో సిబ్బందితో కలసి శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడి ప్రజలతో మాట్లాడారు. బ్యాంకులకు సంబంధించిన వివరాలు ఫోన్లకు వచ్చే ఓటీపీలను అపరచితులకు తెలియజేయకూడదని సూచించారు. వాహనచోదకులు రోడ్డు నియామాలు పాటించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పలు సూచనాలు చేశారు.

ఏజెన్సీలో పారని పథకాలు

- నూతన చెక్‌డ్యాం, చెరువుల నిర్మాణాల నిలిపితే
- ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరు కష్టమే
- గిరిజన ప్రాంతాల్లో గెడ్డలే ఆదారం
- నిర్వీర్యమైన ఎస్‌ఎంఐ విభాగం



ముక్కలైన మద్దిమాను చెక్‌డ్యాం

సీతంపేట:

ఐటీడీఏ పరిధిలో సమగ్ర గిరిజనాభ్యుదయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌ఎంఐ (స్మాల్ అండ్ మైనర్ ఇరిగేషన్) పనులు నిలిచిపోయాయి. 2018లోఎస్‌ఎంఐ విభాగాన్ని ఎత్తివేసి క్వాలిటీ కంట్రోల్ కింద మార్పు చేశారు. కేవలం డీఈ కార్యాలయాన్ని మాత్రమే ఇక్కడ నిర్వహణకు ఉంచారు. అది కూడా చాలీచాలని సిబ్బందితో నిర్వహిస్తున్నారు. దీని పరిధిలో గిరిజన ప్రాంతాల్లో అవసరమైన చోట సాగునీటి వనరులు కల్పించాలి. వర్షాలు పడేటప్పుడు నీరు నిల్వ ఉండేలా అవసరమైనప్పుడు చెక్‌డ్యాం, చెరువులు వంటివి నిర్మించాలి. ఏజెన్సీలో కేవలం వర్షాధార పంటలే కాబట్టి ఈ నీటిని పొలాల సాగుకు వాడతారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ గిరిజన ఉపప్రణాళికా విభాగం ద్వారా 20 మండలాల్లో చిన్ననీటి పారుదల పథకాలైన చెక్‌డ్యాంలు, చెరువుల నిర్మాణాలు కొత్తగా లేవు. పిల్ల కాలువలను కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. అవేమీ చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా టీపీఎంయూ మండలాల పరిధిలో పనులు అధికంగా జరగాలి. ఈ శాఖకు నిధుల లేమి కారణంగా పనులు చేపట్టలేని పరిస్థితి ఉందని సంబంధిత అధికారులే తెలియజేస్తున్నారు. చెక్‌డ్యాం, చెరువుల నిర్మాణాలు, మరమ్మతులు లేవు. గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు ఇంచుమించు అన్నీ పాడైపోయాయి. కేవలం గెడ్డల్లో ఉన్న నీటి నిల్వల మీద ఆధారపడి సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. అవి కూడా ఇప్పుడు అడుగంటిపోయాయని వాపోతున్నారు.



అభివృద్ధికి నోచుకోని జిల్లేడుపాడు బద్దిమాను చెరువు



కాలువలు సరిగా లేని జాచెట్టు చెక్‌డ్యాం

ఖరీఫ్, రబీ సీజన్‌లలో తప్పని కష్టాలు..

ఈ ఖరీఫ్ సీజన్‌తో పాటు రబీపంటల సాగు కష్టంగా మారింది. ఐటీడీఏ పరిధిలో 20 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు పండుతాయి. ఖరీఫ్‌లో 14 వేల హెక్టార్ల వరకు, రబీలో 6 వేల హెక్టార్ల వరకు వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. వరి, కంది, రాగులు, జొన్నలు, ఉద్యానవన పంటలైన అరటి, జీడి, పసుపు, అల్లం తదితర పంటలు పండిస్తారు. అయితే గెడ్డలను ఆనుకుని ఉన్న గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు, చెరువులలో నీరు లేదు.



చుక్కనీరు లేని బట్టి చింత చెక్‌డ్యాం

అసలు నీటి నిల్వలు ఉండాలనే ఉద్దేశంతో చెక్‌డ్యాంలు, చెరువులు, కాలువలు నిర్మించారు. వాటి మరమ్మతులు కూడా చేసిన దాఖలాలు లేవు. దీంతో ఖరీఫ్, రబీ సాగు ఎండమావిగా మారింది. అలాగే ఉద్యానవన పంటలకు నష్టాలు తప్పడం లేదు. ఉద్యాన వన పంటలైన జీడి,మామిడి, పనస వంటి పంటలను గిరిజనులు పండిస్తున్నారు. ఐటీడీఏ కూడా కొన్ని వేల ఎకరాల ఉద్యానవన పంటలను ప్రోత్సహించినప్పటికీ వాటికి అవసరమైన నీరు అందివ్వలేని పరిస్థితి.

సాగునీటి వనరులకు ఇబ్బందులు



సాగునీటి వనరులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు పండించడానికి అష్టకష్టాలు పడుతున్నాం. కేవలం వర్షాధారంపై ఆధార పడుతున్నాం. గతంలో పలుమార్లు ఐటీడీఏలో వినతులు కూడా ఇచ్చాం. మరమ్మతులు కూడా లేవు. దీంతో గెడ్డలు, వాగునీటిపై ఆధారపడాల్సిన పరిస్థితులున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

–ఎస్.తిరుపతిరావు, సర్పంచ్, శంభాం

పనులకు ప్రతిపాదించాం

చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణాలకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు పెట్టాం. ఎన్ఆర్ఈజీఎస్‌లో ప్రపోజల్స్ ఉన్నాయి. ఉపాధి హామీలో మంజూరైతే అవసరమైన చోట నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

–గన్నిరాజు, ఎస్ఎంఐ డీఈ

గిరిజన భూములను పరిరక్షించాలి

సీతంపేట: గిరిజనుల భూములు, హక్కులు పరిరక్షించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు వి.సుబ్బారెడ్డి, రాజు ఒక ప్రకటనలో కోరారు. భూకబ్జా దారులకు అనుకూలంగా బిల్లమడ గ్రామ పేద గిరిజన ప్రజలపై అధికారులు సాగిస్తున్న నిరంకుశ, చట్ట విరుద్ధ నిరంకుశ చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. బిల్లుమడ ప్రాంతంలో ఎన్నో ఏళ్లగా గిరిజనులు సాగుచేస్తున్న భూములపై పెద్దఎత్తున పోలీసులను మోహరించి చుట్టూ కంచెవేయడం, భూములు దున్నించడం అన్యాయమని, దీన్ని ఖండిస్తున్నామన్నారు.

దేశ రక్షణ కోరి పూజలు



జాతీయ పతాకంతో వేంకటేశ్వర ఆలయంలో అర్చన చేస్తున్న అర్చకులు

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామంలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో దేశ రక్షణ కోరి శుక్రవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు అంపోలు సీతారామశాస్త్రి, కన్నబాబుల నేతృత్వంలో రక్షణ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువత జాతీయ పతాకంతో హాజరయ్యారు. దేశరక్షణలో భాగంగా పాకిస్తాన్‌తో తలపడుతున్న మన సైనికులకు ముప్పులేకుండా విజయం అందించాలని ఆ దేవదేవుడిని కోరుకుంటూ కార్యక్రమం సాగింది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర రావు

పాలకొండ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఈ మేరకు పాలకొండ పట్టణంలోని కల్యాణమండపంలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ డిపోలో డ్యూటీచార్టులు వేయకపోతే ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు రావాల్సిన పదోన్నతులు వెంటనే కల్పించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేసి సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి పి.సుందరరావులు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్‌ల డ్యూటీ చార్టులు వేస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ వాహనాలను నియంత్రించాలని కోరారు. సమావేశంలో జోనల్ కార్యదర్శి బాసూరు కృష్ణమూర్తి, డి దుర్గారావు, ఎంవీ సాగర్, ఎల్.డి.నాయుడు, వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి

డీఆర్సీ ఏడీఏ శ్రీనివాసరావు



అధికారులకు సమస్యలు తెలియజేస్తున్న రైతు ప్రసాదరావు

పాలకొండ రూరల్: అర్హత గల రైతులు అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందేందుకు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని డీఆర్సీ ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండ వచ్చిన ఆయన స్థానిక మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో 1–బి, ఆధార్ లింకు చేసిన ఫోన్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం కిసాన్ యోజన వర్తిస్తుందని చెప్పారు. పీఎం పసల్ బీమా పథకంలో రైతు తన వాటా మొత్తం చెల్లించి చేరడం ద్వారా వరి, మొక్కజొన్న, పెసలు తదితర పంటలకు బీమా పొందవచ్చని తెలిపారు. కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం వీఆర్వో వద్ద నమోదు చేసుకునే క్రమంలో భూ యజమాని అంగీకారం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఖరీఫ్ సేద్యంలో ప్రణాళికా బద్ధంగా భూసార పరీక్షలు చేయించాలని, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఎ.డి కె.రత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలు నివృత్తి చేశారు. మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇలాంటి సరదాలతో... తస్మాత్...



వేసవి సెలవుల్లో పిల్లలు చెరువులు, వాగులు, బావుల్లో స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. ఈ సమయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. సరదాలకు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా పిల్లలకు అవగాహన పరచాలి. వేసవి సెలవుల్లో పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లినపుడు తల్లిదండ్రులు జర భద్రంగా ఉండడం అవసరం. ఈ చిత్రంలో చిన్నారులు జియ్యమ్మవలస మండలంలో నాగావళి కాలువలో ఇలా స్నానం చేస్తూ సరదా పడుతున్నారు. కానీ ఈ సరదా మాటున దాగి ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేని పసి మనసులు వారివి. తస్మాత్...

– జియ్యమ్మవలస రూరల్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు, కిశోరీ బాలికలు

బలిజిపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బలిజిపేట సీడీపీఓ సులేఖ తెలిపారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పలితాలపై బలిజిపేటలో అవగాహన నిర్వహించి ర్యాలీ చేశారు. మండల కేంద్రంలోని నాల్గవ అంగన్వాడీ కేంద్రంలో కిశోరీ బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహం అంటే ఏమిటి? వివాహం ఎన్ని సంవత్సరాలకు చేసుకోవాలి? బాల్య వివాహం వలన కలిగే దుష్పలితాలపై తెలియజేశారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమంటూ బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. వాటికి సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే తెలియపరచాలనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

జియ్యమ్మవలస రూరల్: ఇటీవల కురిసిన వర్షాలు, ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాలుల సమయంలో చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని చినమేరంగి సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల పిల్లలకు వేసవి సెలవులు రావడంతో వారు మండుటెండలను సైతం లెక్క చేయకుండా తిరుగుతుండడం, చిరు తిళ్లకు అలవాటు పడడం వంటివి వారికి మంచివి కావని సూచించారు. జ్వరాల బారిన పడే అవకాశం ఉందని దీన్ని తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. గడిచిన రెండు రోజులుగా గిరిజన గ్రామాలైన వనిజ, పెదదోడిజ, దాసరిగూడ గ్రామాల నుంచి జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు.

డయిల్ యువర్ డీఎంకు పది ఫిర్యాదులు

పాలకొండ రూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం పాలకొండ ఆర్టీసీ డిపోలో చేపట్టిన డయిల్ యువర్ డీఎం కార్యక్రమానికి పది ఫిర్యాదులు అందినట్టు డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరావు తెలిపారు. చీపురుపల్లికి చెందిన వి.శ్రీహరి చీపురుపల్లి నుంచి పార్వతీపురానికి ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేయాలని కోరినట్టు పేర్కొన్నారు. జియ్యమ్మవలసకు చెందిన ఎస్.లక్ష్మంనాయుడు పాలకొండ వయా వీరఘట్టం మీదుగా ఉదయం 10 గంటలకు పాలకొండ నుంచి బస్సు జియ్యమ్మవలస వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారని, పాలకొండకు చెందిన డి.గణేష్ కాంప్లెక్స్ నుంచి కొత్తూరు, శ్రీకాకుళం వెళ్లే బస్సులు స్థానిక కోర్టు, ఎంపీడీవో కార్యాలయాల వద్ద బస్సులు ఆపి ప్రయాణికులను ఎక్కించుకునేలా అవకాశం కల్పించాలని కోరినట్టు డీఎం తెలిపారు. వీటితో పాటు వచ్చిన ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఉన్నతాధికారుల సూచనలతో అమలు చేస్తామన్నారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి



బ్లడ్ బ్యాంక్ మేనేజర్ బీవీ.శివప్రసాద్

పాలకొండ రూరల్: దేశ సరిహద్దుల్లో దాయాది పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం ముంచుకు వస్తున్న క్రమంలో రక్త నిల్వల అవసరం ఉంటుందని పాలకొండ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ మేనేజర్ బీవీ.శివప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను దృష్టిలో పెట్టుకుని దేశం యావత్తు వీర జవాన్లకు అండగా ఉండాల్సిన తరుణమిది అన్నారు. ఈ క్రమంలో యువత, వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్వచ్ఛంద రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర సమయాల్లో రక్తదానం ప్రాణదానంతో సమానమని గుర్తించి సహకరించాలని కోరారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



బాలేరు పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాదికారి శివకుమార్

భామిని: మండలంలోని బాలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షిత మాతృ అభియాన్ ప్రోగ్రాం క్రింద వైద్యపరీక్షలు నిర్వహించారు. పీఎంఎస్ఎంఏ కింద 47 మంది గర్భిణులకు వైద్యాధికారి జి.శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రక్త హీనత, ఇతర పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. గర్భిణులకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసి పౌష్టికాహారం అందించారు.

వీరఘట్టంలో 40 మంది గర్భిణులకు..

వీరఘట్టం: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం 40 మంది గర్భిణులకు డాక్టర్ ప్రదీప్‌కుమార్ వైద్య తనిఖీలు చేశారు. సుగర్, బీపీతో పాటు బ్లడ్ కౌంట్ పరీక్షలు చేశారు. పుట్టే శిశువు ఆరోగ్యకరంగా జన్మించాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆకుకూరలను ఎక్కువ తీసుకోవడం మంచిదన్నారు. అలాగే పండ్లు, గుడ్లు తీసుకోవాలని చెప్పారు. వారందరికీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిపించేలా ఆశ కార్యకర్తలు చొరవ చూపాలని స్పష్టం చేశారు.

మీడియాపై దాడులు సిగ్గుచేటు



కురుపాం తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న కురుపాం జర్నలిస్టులు



కురుపాం తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి, వైఎస్సార్ సీపీ ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: పత్రిక, మీడియా ప్రతినిధుల ఆత్మస్థైర్యం దెబ్బతీసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలని మీడియా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. విజయవాడలో సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంట్లోకి సెర్చ్ వారెంట్ లేకుండా చొరబడిన పోలీసులు మూడు గంటల పాటు తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తించిన తీరుకు నిరసనగా కురుపాం జర్నలిస్టు సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు వేర్వేరుగా తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన చేశారు. వేర్వేరుగా తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులతో పాటు ఎంపీపీ శెట్టి పద్మావతి మాట్లాడుతూ.. కనీసం సెర్చ్ వారెంట్ అడిగినా చూపకుండా దురుసుగా ప్రవర్తించడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుందని తెలిపారు. పత్రికా ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్.ధనుంజయరెడ్డి యొక్క వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు, సమాజంలో పరువు ప్రతిష్ఠలకు విఘాతం కలిగే రీతిలో వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జర్నలిస్టులు జి.పెంటయ్య, రంగనాథ్, కె.చంద్రమౌళి, పృధ్వి, ఢిల్లీశ్వరరావు, సురేష్ తదితరులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నిషార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనదారుల సమస్యలు పరిష్కరించాలి



వేతనదారుల సమక్షంలో సమస్యలపై మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: ఉపాధి హామీ వేతన దారుల సమస్యలు పరిష్కరించాని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు మండలంలోని నర్సిపురం గ్రామంలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి వేతనదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. చట్టప్రకారం 15రోజులకోసారి వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ బకాయిలు ఉంచడం దారుణమన్నారు. వేతనదారులకు వేసవి ఎద్దడి ఉన్నా కనీస స్థాయిలో పనిచేసే ప్రదేశంలో మజ్జిగ, టెంటు, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించకపోవడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం ఇచ్చిన పనిముట్లతోనే నేటికి పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వేతనదారులకు ఇవ్వాల్సిన రవాణా చార్జీలు సైతం నేటికి అందని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

గరుగుబిల్లి: రానున్న ఖరీఫ్‌కు వరి విత్తనాలకు ప్రతిపాదనలు చేసినట్టు ఏఓ ఆర్.విజయభారతి శుక్రవారం తెలిపారు. 22 వేల క్వింటాళ్ల 1064 రకం విత్తనాల కోసం ప్రతిపాదనలు చేయగా, పెద్దూరు, బివి.పురం, గరుగుబిల్లి తదితర గ్రామాల రైతుల కోసం స్వర్ణ రకం విత్తనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల వివరాలను రైతు సేవా కేంద్రాలలో పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అలాగే రైతు విశిష్ట గుర్తింపు కార్యక్రమాన్ని చేపపడు తున్నట్టు పేర్కొన్నారు.

అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: ఐటీఐ అప్రెంటిస్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాలూరు ఐటీఐ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం లోని ప్రముఖ కంపెనీలలో అప్రెంటిస్ ఖాళీలున్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు నేరుగా కళాశాలలో స్వీకరిస్తున్నామన్నారు. అప్రెంటిస్ పూర్తయిన వారు ప్లేస్‌మెంట్ కోసం రావచ్చని తెలిపారు. స్టైపెండ్ రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సర్టిఫికెట్స్ ఒరిజినల్స్, జిరాక్స్‌లతో కళాశాలకు రావాలని సూచించారు.